**విలేఖరులు కావలెను**

తెలుగు రాష్ట్రాలలో లక్షలాది మంది పాఠకుల అభిమానాన్ని చూరగొంటున్న 'సూర్య ప్రభా' ఈ-పేపర్‌లో పని చేయుటకు జిల్లా, నియోజకవర్గాలు, మండలాల వారీగా విలేఖరులు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించగలరు.

**ఫోన్ - 8985829417**


# సూర్య ప్రభా

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 1 సంచిక: 362 | ఎడిటర్ : ఇ.సంజీవరెడ్డి | ఆదివారం, జూన్ 22 2025 | పేజీలు : 4


హైదరాబాద్: భారాస ప్రభుత్వ హయాంలో భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసే పనిలో ఉన్నట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ సదస్సులు ముగిసిన సందర్భంగా ఇవాళ అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ 14న భూ భారతి చట్టాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారని, దశలవారీగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. మొదటి విడత ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో, రెండో విడతలో మే 5 నుంచి 28 వరకు 28 మండలాల్లో, మూడో విడతలో ఈనెల 3 నుంచి 20 వరకు మూడో విడతలో సదస్సులు నిర్వహించినట్లు వివరించారు. ఈ మూడు విడతల్లో రాష్ట్ర వ్యాప్తంగా 593 మండలాల్లో 10,725 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 8.58 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి తెలిపారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67వేలు, భద్రాద్రి కొత్తగూడెంలో 61వేలు, వరంగల్‌లో 54 వేలు, జయశంకర్ భూపాలపల్లిలో 48వేలు, నల్గొండలో 42 వేల దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులకు ముందురోజే ఆయా గ్రామాల్లో రైతులకు ఉచితంగా దరఖాస్తులు ఇచ్చామని, ఎమ్మార్వోల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి




రెవెన్యూ అధికారులే ప్రజల వద్దకు వచ్చి ఎలాంటి రుసుము లేకుండా దరఖాస్తులను స్వీకరించారని వివరించారు. స్వీకరించిన వాటికి రశీదులు అందజేయడం జరిగిందని, వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటివరకు 3.27 లక్షల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. మిగిలిన వాటిని కూడా త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.




హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ అధికారులు మరోసారి విచారించారు.

5 గంటల పాటు ప్రణీత్ రావును సుదీర్ఘంగా ప్రశ్నించారు. ఉదయం 11గంటలకు హాజరయిన ప్రణీత్ రావు...విచారణ ముగిసిన తర్వాత సాయంత్రం 4గంటలకు తిరిగి వెళ్లిపోయారు.


ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ చేశారు, అప్పటి పోలీసు ఉన్నతాధికారుల ప్రమేయం ఈ వ్యవహారంలో ఏ మేరకు ఉందనే కోణాల్లో విచారణ కొనసాగినట్లు సమాచారం.

# విశాఖలో అద్భుతం

## గత రికార్డులు బ్రేక్ చేసిన యోగాంధ్ర




## అంతర్జాతయ యోగా దినోత్సవలంలో పాల్గొన్న మోడీ, బాబు, పవన్! - హాజరైన లక్షలాది మంది ప్రజానీకం



విశాఖలో నేడు 'యోగాంధ్ర' కార్యక్రమం ప్రారంభమైంది. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా... ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులు యోగాసనాలు వేశారు. అంతకు ముందు మోడీ.. యోగా స్మారక పోస్టల్ స్టాంప్ విడుదల చేశారు. అవును... ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధాని విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యారు. 'యోగా ఫర్ వన్ ఎర్త్.. వన్ హెల్త్' నినాదంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. విశాఖలోణి ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు పెద్ద ఎత్తున ప్రజానికం యోగాసనాలు వేశారు.

ఈ సందర్భంగా ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోడీ... అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా... యోగా ప్రపంచ దేశాలను ఏకం చేసిందని.. యోగా దినోత్సవ ప్రతిపాదనకు 175 దేశాలు మద్దతిచ్చాయని.. యోగా అనేది మానవతను పెంచే సామూహిక ప్రక్రియ అని తెలిపారు.

ఇదే సమయంలో... ప్రకృతి సౌందర్యానికి, ప్రగతికి చిరునామా విశాఖపట్నం అని కొనియాడిన ప్రధాని మోడీ... ప్రకృతిలో మనిషి భాగస్వామి అని యోగా గుర్తు చేస్తుందని తెలిపారు. యోగాతో వ్యక్తిగత క్రమశిక్షణ అలవడుతుందని.. యోగా ద్వారా నేను అన్న భావన మనంగా మారుతుందని.. అదే మానవత్వాన్ని పెంచుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్ర బాబు మాట్లా డుతూ... యోగా దినోత్సవం రోజు విశాఖలో రికార్డు సృష్టించబో తున్నామని అన్నారు. 1.44 లక్షల మంది యోగా శిక్షకులు ఈ కార్యక్రమంలో నమోదు చేసుకున్నారని.. నిన్న 22 వేల మంది గిరిజన విద్యార్థులు సూర్య నమస్కారాలతో గిన్నిస్ రికార్డు సాధించారని తెలిపా రు. ఇదే సమయంలో... యోగా అంటే కేవలం వ్యాయామం మాత్రమే కాదని చెప్పిన చంద్రబాబు... యోగాతో క్రమశిక్షణ, ఏకాగ్రత పెరుగు తాయని.. యోగా దినోత్సవాన్ని 130 దేశాల్లో నిర్వహించు కుంటున్నారని తెలిపారు.

యోగాను అన్ని క్రీడల్లో భాగం చేయాలని.. 'స్వర్ణాంధ్ర 2047' సాధనలో యోగాకు భాగస్వామ్యం కల్పిస్తామని చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... మోడీ సమక్షంలో, చంద్రబాబు కృషితో ప్రపంచ రికార్డు సాధించబోతున్నామని.. యోగా విశిష్ఠతను రుగ్వేదం చెబితే.. దాన్ని ప్రధాని మోడీ విశ్వవ్యాప్తం చేశారని అన్నారు. 'వన్ ఎర్త్.. వన్ హెల్త్' థీమ్ ను విశాఖ వేదిక నుంచి ప్రతి ఒక్కరు ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఇదే సమయంలో... భారతీయ సనాతన ధర్మం విశిష్ఠతను యోగా ద్వారా ప్రపంచానికి తెలిపిన ఘనత మోడీదే అని చెప్పిన పవన్ కల్యాణ్.... యోగా సాధకులు ఎంతటి దృఢ చిత్తంతో ఉంటారనేదానికి.. ఒత్తిడిని జయించి సంకల్ప సాధకులుగా ఎలా నిలబడతారనేదానికి మోడీ నిలువెత్తు ఉదాహరణ అని పేర్కొన్నారు.



## కూర్చుంటే పోలా!!

# ఇద్దరు సీఎంలు-ఒక ప్రాజెక్టు!

## ఓపెన్ ఆఫర్ ఇచ్చిన చంద్రబాబు - సానుకూలంగా స్పందిస్తున్న రేవంత్‌రెడ్డి!

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాల్లో కీలకమైన ఘట్టానికి కేంద్రం ఎలాంటి ముగింపు ఇస్తుంది? ఎలాంటి దశ-దిశ చూపిస్తుంది? అనేది ఆసక్తికరం. తాజాగా తెరమీదికి వచ్చిన బనకచర్ల ప్రాజెక్టు కావొచ్చు. గతంలోనే ఉన్న సాగర్, శ్రీశైలం తగువులు కావొచ్చు.. వేటినైనా కేంద్రం పరిష్కరించిం దా? అంటే.. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య చోటు చేసుకున్న ఇలాంటి వివాదాలను కేంద్రం ఎప్పుడూ రాజకీయ కోణంలోనే చూసిందన్నది వాస్తవం. "తెలంగాణలో అయినా.. ఏపీలో అయినా.. రాజకీయ ప్రయోజనాలు లేకుండా అడుగులు వేయడం కష్టం " అంటూ.. నిరుడు కేసీఆర్ హయాంలోనే కేంద్రం స్పష్టం చేసింది. నాడు జగన్ ప్రభుత్వం ఏపీలో తలపెట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకం అయినా.. నేడు బనకచర్ల ప్రాజెక్టు అయినా.. స్వరూపం.. సాధ్యాసాధ్యాలు కూడా ఒక్కటే. వృథాగా పోతున్న గోదావరి జలాలను.. ఒడిసి పట్టి.. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు పారించడమే. వృథాగా పోయే నీటి విషయం అయితే.. ఎందుకు ఇంత యాగీ ఉంటుందన్నది మరోప్రశ్న. వృథాగా పోయే నీటిని తీసుకుంటే.. ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ.. ఏడాదిలో మూడు నుంచి 4 మాసాల వరకు మాత్రమే నీటి వృథా మనకు కనిపిస్తుంది. కానీ, ఇతర మాసాల్లోకి వచ్చేసరికి.. గోదావరి జలాలు ఆశించిన మేరకు కూడా ఉండడం లేదు. ఇదే అసలు చిక్కు. ఈ విషయమే అసలు వివాదానికి కారణం. "నీరు ఉన్నప్పుడు తీసుకుంటే తప్పులేదు. కానీ, లేనప్పుడు కూడా లాగేస్తారు" అనేదే తెలంగాణ వాదన. పైగా.. దిగువ రాష్ట్రంగా ఉన్న ఏపీ ప్రాజెక్టులు కట్టుకుంటే.. ఇప్పుడు ఎలా ఉన్నా.. రేపు నీటి వాటాల విషయంలో రగడలు, పంతాలకు పోయే అవకాశం ఉందని తెలంగాణ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే నాడు కేసీఆర్ కూడా రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టుకు అడ్డుపడ్డారు. నేడు బనకచర్ల వ్యవహారం తెరమీదికి వచ్చింది.ఏపీకి గేమ్ ఛేంజర్ అంటూ.. చంద్రబాబు ప్రచారం చేసుకున్నా.. తెలంగాణకు ఇది ఉరి తాడవుతుందన్న అక్కడి నేతల ప్రచారం కూడా చర్చనీయాంశమే. దీంతో ఒక్కసారి ఇరు రాష్ట్రాల మంత్రులు, ముఖ్యమంత్రులు కూర్చుని మాట్లాడుకుంటే సమస్యకు

## ప్రతిపక్షాలు సహకరిస్తాయా...!?

ఒక పరిష్కారం దక్కే అవకాశం ఉంటుందని అంటున్నారు పరిశీలకులు. కూర్చుని చర్చించుకుంటే తప్పులే దని.. ఎవరికి ఉన్న సందేహాలను వారు తెలుసుకునేందుకు, పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇది చంద్రబాబు ప్రకటించిన ఓపెన్ ఆఫరే అయినా.. తెలంగాణ ఏమేరకు ముందుకు వస్తుందన్నది చూడాలి. అయితే నిన్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చంద్రబాబు వ్యాఖ్యలపై సానుకూలంగానే స్పందించారు. అయితే తెలంగాణలో ఉన్న పరిస్థితులు వేరు. ప్రతిపక్ష పార్టీలు రేవంత్‌రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్న వారికి అనుకూలంగా మలచుకుని రాద్ధాంతం చేయడం మాత్రం కామన్.

అలాగే అధికార పార్టీలో సైతం రేవంత్‌రెడ్డి అంటే గిట్టని వారున్నారు. వారు కూడా ఇదే ప్రస్థావన తెచ్చే అవకాశం ఉంది. ఈనెల 23న జరగనున్న తెలంగాణ క్యాబినెట్ మీటింగ్‌లో ఈ విషయంపై ఓ నిర్ణయానికైతే సర్కార్ ఓ నిర్ణయానికి వచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

# తాత్కాలిక మరమ్మతులు ఎన్నాళ్లు నిలిచేను..!

కోనరావుపేట: జిల్లావ్యాప్తంగా పలుచోట్ల కాజ్‌వేల నిర్వహణ అధ్వానంగా ఉంది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో కనీస చర్యలు చేపట్టక పోవడంతో ఈసారికూడా ఇబ్బందులు తప్పేలా లేవని ప్రయాణికులు అంటున్నారు. జిల్లాలో వీర్నపల్లి, గంభీరావుపేట, కోనరావుపేట, రుద్రంగి, చందుర్తి మండలాల్లో అటవీ ప్రాంత గ్రామాలున్నాయి. ఈ మండలాల గుండా పొరుగునే ఉన్న జిల్లాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పలుచోట్ల కాజ్‌వేలు, కల్వర్టుల నిర్వహణ అధ్వానంగా ఉండటంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతిఏటా వర్షాకాలంలో వరద తీవ్రతకు కాజ్‌వేలు కోతకు గురై రాకపోకలు నిలిచిపోవటం పరిపాటిగా మారింది. వర్షాలు తగ్గుముఖం పట్టి రెండు మూడు మాసాలు గడిచిన తరువాత కాజ్‌వేలకు తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. ఇందుకోసం రూ.లక్షల వ్యయం అవుతుండగా సమస్య ఎప్పటిలాగే ఉంటోంది.

**ఏటా అదే సమస్య...**

కోనరావుపేట మండలం కొండాపూర్–వెంకట్రావుపేట గ్రామాల మధ్య పెంటి వాగు, నిజామాబాద్–మామిడిపల్లి, బావుసాయిపేట–



వెంకట్రావుపేట, వట్టిమల్ల–నిమ్మపల్లి గ్రామాల మధ్య మూలవాగుపై నిర్మించిన కాజ్‌వేలు గత మూడేళ్లుగా వర్షాకాలంలో కోతకు గురవుతున్నాయి. మూలవాగు పరీవాహక గ్రామాల రైతులు, వాహనదారులు మండల, జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించటానికి సుమారు 20 కిలో మీటర్ల మేర చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. దీంతో వ్యయ, ప్రయాసలకు గురవుతున్నారు. రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు. సరైన సమయంలో వ్యవసాయ పనులు చేసుకోవటానికి ఇబ్బందిగా మారుతోందని ప్రజలు వాపోతున్నారు. ఉదయం పొలం పనులకు వెళ్లిన రైతులు వర్షం కురిసి వాగు ప్రవహిస్తే ఇంటికి చేరుకోలేని పరిస్థితి నెలకొంటోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**హైలెవల్ వంతెనలు నిర్మిస్తే మేలు**

సిరిసిల్ల జిల్లా కేంద్రం నుంచి కోనరావుపేట, మరిమడ్ల, సిరికొండ మీదుగా నిజామాబాద్ జిల్లా కేంద్రానికి రెండు వరుసల తారు రోడ్డు సౌకర్యం ఉంది. వర్షాకాలంలో పెంటివాగు వద్ద కాజ్‌వే మూడేళ్లుగా కోతకు రెండు, మూడు నెలలు రాకపోకలు నిలిచిపోతున్నాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లే వాహనదారులు కామారెడ్డి మీదుగా వెళ్లాల్సి రావటంతో సుమారు 50 కిలో మీటర్ల మేర వ్యయ, ప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. హైలెవల్ వంతెనలు నిర్మిస్తే మేలు.పుల్కం ప్రశాంత్, వాహనదారుడు మరిమడ్ల

**నిధులు వృథా**

మూలవాగు, పెంటి వాగుపై నిర్మించిన కాజ్‌వేలు కోతకు గురవుతున్నాయి. కోతకు గురైన కాజ్‌వేలకు రూ.లక్షలు వెచ్చించి తాత్కాలిక మరమ్మతు చేపట్టినా నిధులు నీటి పాలవుతున్నాయి. కాజ్‌వేలపై అధిక లోడుతో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో కూరుకుపోతున్నాయి. మరికొద్ది రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి. ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలి.గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, బావుసాయిపేట

# కొనసాగుతున్నాయ్..!

ధర్మపురి : నూతన విద్యా సంవత్సరానికి మరో 17 రోజులే మిగిలి ఉంది. వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు కొత్త రంగులు, హంగులతో స్వాగతం పలుకుతాయని భావిస్తున్న పల్లె విద్యార్థులకు ఈ సారి కూడా నిరాశ తప్పడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించాలనే లక్ష్యంతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో ప్రభుత్వం గతేడాది పనులు ప్రారంభించినా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. దాదాపుగా 75 శాతం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం కనిపించడం లేదు. పనులు పూర్తయిన చోట సరికొత్తగా విద్యార్థులను ఆహ్వానించనుండగా, కొన్నిచోట్ల అసంపూర్తి పనులతో ఇబ్బందులు ఎదురవనున్నాయి. అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి నిలిపి మిగిలిన పనులు పూర్తయ్యేలా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

జిల్లాలో ఏప్రిల్, మే నెలల్లో 517 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో పనులు ప్రారంభించారు. తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, విద్యుత్తు, భవన మరమ్మతు చేపట్టాలని నిర్ణయించారు. క్షేత్ర స్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు సర్వే చేసి సూచించిన పనులు చేపట్టాలని భావించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రత్యేక అవసరాల కింద పరిగణనలోకి తీసుకొని 2024 జూన్ నాటికే ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. పనులు 75 శాతం పూర్తయినట్లు, వీటిని ప్రారంభం చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన పనులు ఎందుకు పూర్తి చేయడం లేదనే ప్రశ్న తలెత్తుతోంది.

సారంగాపూర్ మండలంలోని 21 పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్తు, తరగతి గదుల మరమ్మతు, మూత్రశాలల నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేశారు. మండలంలోని రంగపేటలో తాగునీటి వసతి పూర్తి కాగా, నాగునూర్‌లో పనులు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. బాలికల మూత్రశాలలు ఎక్కడా పూర్తి కాకపోవడంతో అవస్థలు తప్పేలా లేవు. పలు పాఠశాలల్లో వంట గదులు లేకపోవడంతో ఆరు బయటనే కొనసాగుతున్నాయి. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే పనులు పూర్తి చేస్తేనే విద్యార్థులు, ఉపాధ్యాయులకు మౌలిక వసతులు సమకూరి ఇబ్బందులు తప్పనున్నాయి.

ఇది ధర్మపురి పట్టణంలోని ప్రాథమిక పాఠశాల. ఇక్కడ సుమారు రూ.లక్ష వ్యయంతో పాఠశాల పైకప్పు మరమ్మతు, ఇతర పనులు పూర్తి చేశారు. సంపు, మరుగుదొడ్ల నిర్మాణం ఇంకా పూర్తి చేయాల్సి ఉంది. దీనికి మరో రూ.లక్ష వరకు నిధులు అవసరం అవుతాయి. ఈ నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

**ఆదర్శంగా తీర్చిదిద్దుతాం..**

ధర్మపురి మండలంలో మిగిలిన పనులను పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే దాదాపు 75 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను జూన్ నెలారంభం వరకు పూర్తయ్యేలా చర్యలు చేపడతాం. పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. సీతాలక్ష్మి, ఎంఈవో ధర్మపురి

# చెరువు.. ఆక్రమణల దరువు



హైదరాబాద్ : శంషాబాద్‌లో రషీద్‌గూడ శ్యామచెరువు ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలివి. స్థానికులు ఆర్నెల్ల కిందట అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు స్పందించి పోలీసు కేసు నమోదు చేయించారు. నెలరోజుల తర్వాత తిరిగి నిర్మాణ పనులు మొదలుపెట్టడంతో అధికారులకు మళ్లీ ఫిర్యాదు చేశారు. కేసు పెట్టించాం.. హైడ్రా దృష్టికి తీసుకెళ్లామంటూ అధికారులు సమాధానమిచ్చి చేతులు దులుపుకొన్నారు.గాజులరామారం బంధం చెరువుకు సమీపంలోని ఇళ్లు, నిర్మాణాలివి. బఫర్‌జోన్‌లో ఇళ్లు కట్టుకుంటున్నారని స్థానికులు నాలుగైదేళ్ల క్రితం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను కోరారు. అధికారులు నిర్మాణదా రులను హెచ్చరించినా.. వారి పని కానిచ్చేసుకున్నారు తాజాగా బఫర్‌జోన్‌ను ఆనుకొని కొత్తగా నిర్మాణాలు చేపట్టారు. కొందరు అధికారులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోవడం లేదు. నగర శివారులోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. శంషాబాద్, గాజులరామారం చెరువులతో పాటు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని 50 శాతానికిపైగా చెరువుల్లో ఇలాంటి నిర్మాణాలున్నాయి. నీటి వనరులను పరిరక్షించాల్సిన నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు వాటివైపు చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**నిర్లక్ష్యం వల్లే..** చెరువుల ఎఫ్‌టీఎల్‌లు, బఫర్‌జోన్లలో ఇళ్లు, గోదాములు, ఫంక్షన్‌హాళ్లు ఏర్పాటయ్యాయంటే ప్రధానకారణం మున్సిపాలిటీలు, విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యమే. కళ్ల ముందే స్పష్టంగా కనిపిస్తున్నా.. మున్సిపల్ అధికారులు నిర్మాణాలకు అనుమతులిస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు కనెక్షన్లు ఇస్తున్నారు. ఆయా నిర్మాణాల యజమానులు కోరినన్ని విద్యుత్ నియంత్రికలను ఏర్పాటు చేస్తున్నారు. నీటిపారుదల, రెవెన్యూ, మున్సిపాలిటీ, విద్యుత్‌శాఖ అధికారుల మధ్య సమన్వయలోపంతో ఇలాంటి అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, ఖాజాగూడ, నానక్‌రామ్‌గూడ, గండిపేట్, రాజేంద్రనగర్, శంషాబాద్, బాలాపూర్ మండలాల్లోని కొన్ని చెరువుల్లో అక్రమ నిర్మాణాలున్నాయి. సమీపంలోనే లే–అవుట్లు వెలుస్తున్నాయి. శంషాబాద్‌లోని చెరువుల్లో ఆక్రమణలపై నీటిపారుదలశాఖ ఏఈ మౌనికను వివరణ కోరగా.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# మత్తు ఉచ్చు.. గుట్టురట్టు




హైదరాబాద్: "కుటుంబ బాధ్యతలు.. ఉద్యోగ లక్ష్యాల మధ్య ఒత్తిడికి గురై కాస్త రిలాక్స్ అవుదామని ఎప్పుడైనా డ్రగ్స్ తీసుకుంటాను. ఇంట్లో తెలియకుండా జాగ్రత్తగా ఉన్నా. బయటకు తెలిస్తే తలెత్తుకొని తిరగలేను. ఒక్కసారి క్షమించి వదిలేయండి సార్.." మాదకద్రవ్యాలకు అలవాటుపడిన ఓ ప్రజాప్రతినిధి బంధువు పోలీసుల కౌన్సెలింగ్‌లో చేసిన వేడుకోలు. ఇతనొక్కడే కాదు.. డ్రగ్స్ తీసుకుంటూ పోలీసులకు పట్టుబడిన వారి నోటి నుంచి వస్తున్న మాటలు ఇలాగే ఉంటున్నాయి. గుట్టు బయటపడదనే ధీమాతో స్నాప్‌చాట్, టెలిగ్రామ్ యాప్‌ల్లో లావాదేవీలు నిర్వహిస్తూ మత్తుపదార్థాలు కొంటున్న వారి జాతకాలను పోలీసులు బట్టబయలు చేస్తున్నారు. బుద్ధిమంతులమంటూ తప్పించుకునే ప్రయత్నంచేసినా, ఆధారాలు చూపడంతో తప్పుచేశామని అంగీకరిస్తున్నారు. అవకాశమిస్తే అలవాటు నుంచి బయటపడతామని ప్రాధేయపడుతున్నారని ఓ పోలీసు అధికారి తెలిపారు.

**ఎలా బయటపడుతున్నారంటే**

ఇటీవల టీజీన్యాబ్‌కు పట్టుబడిన డ్రగ్స్ కింగ్‌పిన్ మ్యాక్స్‌వెల్‌కు దేశవ్యాప్తంగా 2–3వేల మంది కస్టమర్స్ ఉన్నారు. వీరిలో సుమారు 400 మంది ఏపీ, తెలంగాణ వారేనని గుర్తించారు. హ్యాష్‌ఆయిల్ స్మగ్లర్ లక్ష్మీపతి పలుమార్లు అరెస్టయినా బుద్ధి మార్చుకోలేదు. ఇతడి వద్ద 50మంది కొకైన్, హెరాయిన్, ఓషన్‌గంజా కొనుగోలు చేస్తున్నట్టు తేల్చారు. గోవా, బెంగళూరు, ముంబయి కేంద్రంగా నైజీరియన్లతో సంబంధాలు పెంచుకొని డ్రగ్స్ దందా సాగిస్తున్నవారిపై పోలీసు యంత్రాంగం గురిపెట్టింది. ఈ ఏడాది 5 నెలల్లో 35మంది ప్రధాన నిందితులు అరెస్టయ్యారు. వారి సెల్‌ఫోన్లతో కొనుగోలుదారుల వివరాలు రాబడుతున్నారు. సామాజిక మాధ్యమాలద్వారా కోడ్‌భాషలో చేసిన చాటింగ్‌లు, నగదు లావాదేవీల ఆధారంతో వినియోగదారులను గుర్తించి పోలీస్‌స్టేషన్ల నుంచి నోటీసులు జారీ చేయిస్తున్నారు.

**అందరి నోట ఒకేమాట**

మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారిలో అధికశాతం ఉన్నత విద్యావంతులే ఉంటున్నారు. ప్రతి 100 మందిలో 90 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వైద్యులు, ఇంజనీరింగ్ విద్యార్థులు ఉంటున్నారని ఒక పోలీసు అధికారి తెలిపారు. రూ.లక్షల్లో ప్యాకేజీ తీసుకుంటూ కంపెనీలో కీలకంగా వ్యవహరిస్తున్న ఉద్యోగులు ఉన్నారని ఒక ఇన్‌స్పెక్టర్ వివరించారు. మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు మత్తుకు అలవాటవుతున్నారు. కొందరు పార్టీలో సరదాగా తీసుకున్నామంటారు. ఇంకొందరు ఆర్థిక ఇబ్బందులు, కుటుంబసమస్యలు కారణంగా చెబుతున్నారు. బ్యాక్‌లాగ్స్ ఉన్నాయని, సరైన ప్లేస్‌మెంట్ సాధించలేకపోయామని విద్యార్థులు సమాధానమిస్తున్నారని నగరానికి చెందిన ఓ ఇన్‌స్పెక్టర్ వివరించారు. తొలుత కొనుగోలుదారులను నిందితులుగా చేర్చకుండా మానవతా కోణంలో వ్యవహరించేవారు. దీన్ని అనువుగా మార్చుకొని నైజీరియన్లతో లింకులు ఏర్పరుచుకొని దందా సాగించేంతగా తయారవుతున్నారని తెలిపారు. వీరి కదలికలపై సంబంధిత పోలీసులు నిఘా ఉంటుందని, ఏ మాత్రం అనుమానం వచ్చినా అదుపులోకి తీసుకుంటామని స్పష్టంచేశారు.

# ప్రణాళిక సరే.. పనులేవి?



వికారాబాద్ : పురపాలికల్లో వానాకాలం ప్రణాళికలు కార్యరూపం దాల్చడం లేదు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా పనులు చేస్తున్నామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. వరద నీరంతా వీధుల్లో ప్రవహించడం, ఇళ్లలోకి చేరడంతో పేదలు ఏటా అవస్థలు పడుతున్నారు. ఇలాంటి సమస్యలు పరిష్కారానికి నోచడం లేదు.వికారాబాద్ పురపాలికల్లో పర్యవేక్షణ కరవైంది. కొందరు నాలాలు ఆక్రమించి నిర్మిస్తున్నారు. మురుగు కాల్వలు మూసుకుపోవడంతో వరద సాఫీగా పారడం లేదు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా పనులు తూతూ మంత్రంగా చేస్తున్నారని పట్టణ వాసులు వాపోతున్నారు. దోమల నివారణ పనులు మచ్చుకైనా కనిపించడం లేదు. పరిగిలో రెండు ఫాగింగ్ యంత్రాలున్నా విడతల వారీగా పనులు చేయడం లేదు.

**ప్రణాళికాబద్ధంగా పనులు..**

మురుగు కాల్వలు శుభ్రం చేయడం, పొదల తొలగింపు, ఇతర అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నాం. వార్డుల వారీగా ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకుంటాం.జాకీర్ అహ్మద్, వెంకటయ్య, కమిషనర్లు, వికారాబాద్, పరిగిదోమల నివారణకు చర్యలు కరవు

వానాకాలం ప్రణాళిక రూపొందించినా చెప్పుకోదగ్గ తీరులో పనులు కావడం లేదు. 36 వార్డుల్లోని పక్కా కాలువల్లో మురుగు పారేలా పూడిక తొలగిస్తున్నారు. కచ్చా వాటిని పట్టించుకోవడం లేదు. దోమల నివారణకు సాయంత్రం వేళ ఫాగింగ్ చేయడం లేదు. కాలువలను ఆక్రమించిన నిర్మాణాలు తొలగిస్తున్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా పనులు మాత్రం పూర్తి స్థాయిలో కావడం లేదు.

**స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్నాం..**

పట్టణ ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నాం. వానాకాలం ప్రణాళికలు రూపొందించి అమలు చేసే చర్యలు ప్రారంభించాం. వీధుల్లో వరద నిలవకుండా కాలువల్లో పేరుకున్న పూడిక తొలగిస్తున్నాం. – విక్రమ్‌సింహారెడ్డి, పుర కమిషనర్

**అవగాహన కరవు**పురపాలికలో వంద రోజుల ప్రణాళిక పనులు చేస్తున్నారు. పుర సిబ్బంది 1, 8, 12తోపాటు పలు వార్డుల్లో మురుగు కాలువలు శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు తొలగించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులు నిర్వహిస్తున్నారు. ఇంకా పనులు చేయాల్సి ఉంది.**అయిదు వార్డుల్లో పనులు కొనసాగుతున్నాయి..**

వంద రోజుల ప్రణాళికలో భాగంగా పనులు చేయిస్తున్నాం. తడి, పొడి చెత్తపై అవగాన కల్పిస్తున్నాం. అయిదు వార్డుల్లో పనులు కొనసాగుతున్నాయి. డెంగీ, మలేరియా సోకకుండా దోమల మందులు పిచికారీ చేయిస్తాం.బలరాంనాయక్, కమిషనర్.

# కోర్ బ్రాంచుల్లో చేరండి

హైదరాబాద్: ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష రాసి ర్యాంకులు సాధించిన విద్యార్థులు సివిల్.. మెకానికల్.. ఎలక్ట్రికల్ వంటి కోర్ బ్రాంచుల్లో చేరాలని జేఎన్‌టీయూ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈనెల 21న జేఎన్‌టీయూ ప్రాంగణంలో ఉన్నతవిద్యామండలితో కలిసి సంయుక్తంగా సదస్సును నిర్వహించనున్నారు. ఎప్‌సెట్‌లో ర్యాంకులు సాధించిన వారిలో 90శాతం మంది కంప్యూటర్‌సైన్స్‌లో చేరాలనుకోవడం, కన్వీనర్ కోటాలో సీటు రాకపోతే ప్రైవేటు కళాశాలలను ఎంపిక చేసుకోవడం వంటి పరిణామాల నేపథ్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సంప్రదాయ కోర్సులైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచ్‌లకు డిమాండ్ ఎప్పుడూ ఉంటుందని వివరించనున్నారు. ఈ సదస్సుకు హాజరుకావాలనుకున్న విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ కేవీరావు తెలిపారు.

**తెలంగాణ రైజింగ్.. ఇంజినీరింగ్‌కు డిమాండ్**

తెలంగాణ రైజింగ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, విదేశీ సంస్థలతో ఒప్పందాలు, పరిశ్రమల స్థాపన,




ప్రభుత్వ సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణం, విద్యుత్ లైన్ల ఏర్పాట్లు.. రహదారుల నిర్మాణం.. ఆటోమొబైల్, టెక్స్‌టైల్స్ పరిశ్రమలు వస్తున్నాయి. వీటిల్లో ఇంజినీరింగ్ నిపుణులు మాత్రమే అర్హులు. వచ్చే నాలుగేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో కనిష్ఠంగా 40వేల మంది ఇంజినీర్లకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

**మైనర్ డిగ్రీతో సాఫ్ట్‌వేర్ పరిజ్ఞానం**

సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచులు చదివేవారు సైబర్‌భద్రత, మిషన్ లర్నింగ్‌లనూ నేర్చుకోవచ్చు. కంప్యూటర్ సైన్స్‌ను మైనర్ డిగ్రీగా అభ్యసించేందుకు అవకాశముంది. కోర్ బ్రాంచులకు ఆదరణ పెంచేందుకు జేఎన్‌టీయూ అధికారులు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఇవ్వాలని కంపెనీల సీఈవోలతో చర్చిస్తున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కొత్త పరిణామాలను తెలుసుకునేందుకు అవగాహన సదస్సు ఉపయోగపడనుంది.

# ఈ బీమా.. ధీమా లేనిది

హైదరాబాద్: కారు, ద్విచక్రవాహనం బీమా పునరుద్ధరణ, జీవిత బీమా పాలసీ తీసుకోవడానికి ఆన్‌లైన్‌లో వెతుకుతుంటాం. ఇంతలోనే బీమా సంస్థ ప్రతినిధుల పేరుతో ఫోన్ కాల్.. సందేశం వచ్చిందా! ఇంటి నుంచి అడుగు బయట పెట్టకుండా ఒక్క క్లిక్కుతో అంతా ఆటోమేటిక్‌గా జరిగిపోతుందని చెప్పగానే నమ్మారా..? బహుమతులు, ఉద్యోగాలే కాదు.. బీమా బదలాయింపు, సాంకేతిక సమస్యలు, గడువు ముగిస్తే పునరుద్ధరిస్తామంటూ సైబర్ నేరగాళ్లు నిండా ముంచుతున్నారు. ప్రముఖ బీమా సంస్థల పేరుతో నకిలీ ఈ–మెయిళ్లు, సందేశాలు పంపి డబ్బు కొల్లగొడుతున్న ఘటనలు ఇటీవల పెరిగాయి. వాస్తవానికి బీమా వివరాలు, వాటి గడువు ఇతర సమాచారం ఇటు పాలసీదారుకు, బీమా సంస్థలకు మాత్రమే తెలుస్తాయి. సైబర్ నేరగాళ్లు ఈ సమాచారాన్ని డేటా ప్రొవైడర్లు, బ్రోకింగ్ కంపెనీల నుంచి సంపాదిస్తారు. వీటితో నేరగాళ్లు నేరుగా ఫోన్ చేసి కొత్త బీమాతో అధిక లాభాలు, పునరుద్ధరించుకోవాలని ఫోన్ చేస్తున్నారు. ఎక్కువ మంది వీటిని నమ్మి రూ.లక్షల్లో మోసపోతున్నారు.

**ఇవీ జాగ్రత్తలు..!**

బీమా పునరుద్ధరణ, బదలాయింపు పేరుతో వచ్చే ఈ–మెయిళ్లు, సందేశాలను నమ్మొద్దు. బీమా వివరాలను కొన్ని సంస్థలు పంచుకుంటాయి. లేదా డేటా భద్రపరించే థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారా ఇవి నేరగాళ్లకు చేరతాయి.ప్రస్తుతమున్న బీమా పాలసీల బదులు కొత్తది తీసుకుంటే మేలని చెప్పేవాటిని నమ్మొద్దు.

నేరుగా బీమా సంస్థ/ఏజెంటును సంప్రదించిన తరువాతే.. పాలసీల్లో మార్పులు ఇతర అవకాశాలను పరిశీలించాలి

**ఒకవేళ మోసపోతే**ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ లేదా స్థానిక పోలీసులను ఆశ్రయించాలి.ఒకవేళ వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రకటనలతో కూడిన సందేశాలు, లింకులు వస్తే రిపోర్టు చేయాలి.

# జలమండలికి విద్యుత్ ఛార్జీల భారం

హైదరాబాద్: మహానగరానికి తాగునీటిని సరఫరా చేసే జలమండలికి విద్యుత్ ఛార్జీల భారం తడిసి మోపెడవుతోంది. సంస్థకు వస్తున్న రాబడి వేతనాలు, నిర్వహణకే సరిపోతుండటంతో విద్యుత్ బకాయిల భారం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా రూ.120 కోట్లకు పైగా బిల్లు బకాయి పడుతోంది. జనవరి నాటికే రూ.5500 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. ఈ ఆర్నెల్లలో మరో రూ.700 కోట్లు తోడయ్యాయి. ప్రధానంగా కృష్ణా, గోదావరి నుంచి ఎత్తిపోతల ద్వారానే నీటిని తీసుకువస్తుండటంతో విద్యుత్ ఛార్జీల భారం ఎక్కువగా ఉంటోంది. నీటి శుద్ధి ప్లాంట్లు, ఎస్టీపీలు, పంపుహౌస్‌లు వివిధ రూపాల్లో



అదనంగా ఛార్జీల భారం పడుతోంది. ఈ భారాన్ని తగ్గించే అవకాశాలపై జలమండలి దృష్టి సారిస్తోంది.

ప్రణాళిక ఇలా..: జలమండలికి ఉన్న మొత్తం విద్యుత్ కనెక్షన్లపై పూర్తి స్పష్టత లేదు. వినియోగంలో లేని కనెక్షన్లు చాలా ఉన్నట్లు గుర్తించారు. వాటి తొలగింపుతో కొంత ప్రయోజనం ఉంటుందని భావిస్తోంది. తాజాగా 31మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై దృష్టి సారించింది. నెలకు కనీసం రూ.10కోట్ల మేర విద్యుత్ ఛార్జీలు తగ్గించే లక్ష్యంలో వీటిని ఏర్పాటుచేయనుంది. ఇప్పటికే ప్రతిపాదనలను తెలంగాణ రెడ్కోకు అందజేసినట్లు జలమండలి ఉన్నతాధికారులు వివరించారు.




## గచ్చిబౌలి స్టేడియంలో యోగా డే వేడుకలు.. భారీగా తరలివచ్చిన నగరవాసులు

హైదరాబాద్: నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో యోగా డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, సీఎస్ రామకృష్ణారావు హాజరయ్యారు. ప్రజలకు యోగా విశిష్టతను వివరించారు. నగరవాసులు పెద్దఎత్తున పాల్గొని ఉత్సాహంగా యోగాసనాలు వేశారు.




హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని చెప్పింది తానేనన్నారు. "హైదరాబాద్, సిరిసిల్ల కేంద్రంగా ఫోన్‌ట్యాపింగ్ జరిగింది. ప్రభాకర్‌రావు చాలా మంది జీవితాలను నాశనం చేశారు. భారాస నేతలు, వారి భార్యల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలి. పెద్దాయన చెబితే ఫోన్ ట్యాపింగ్ చేశామని ఇప్పటికే రాధాకిషన్ చెప్పారు. కేసీఆర్, కేటీఆర్‌కు ఇంకా ఎందుకు నోటీసులు ఇవ్వలేదు. ఫోన్ ట్యాపింగ్‌కు వారే కారణం. సీఎంవోను అడ్డాగా చేసుకుని ప్రభాకర్‌రావు ఫోన్ ట్యాపింగ్ చేశారు. ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం మర్యాదలు చేయడం ఆపాలి. పేపర్ లీక్ కేసులో ఆయన ఆదేశాలతోనే నన్ను అరెస్టు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభాకర్‌రావు అండ్ కోను కాపాడే ప్రయత్నాలు చేస్తోంది. ప్రభాకర్‌రావు భారత్‌కు వచ్చేముందు కేటీఆర్ అమెరికా ఎందుకు వెళ్లారు? నాకు సిట్ అధికారుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. వారు వచ్చి విచారిస్తామన్నారు" అని బండి సంజయ్ తెలిపారు.




## ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ దస్త్రాలపై మంత్రి అడ్లూరి తొలి సంతకం

హైదరాబాద్: సచివాలయంలో మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ బాధ్యతలు స్వీకరించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో గడ్డం వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు స్థానం కల్పించిన సంగతి తెలిసిందే. వాకిటి శ్రీహరికి క్రీడలు, యువజన సర్వీసులు, పశుసంవర్ధక శాఖ, గడ్డం వివేక్‌కు కార్మిక, గనుల శాఖలు కేటాయించారు.

తాజా విస్తరణతో క్యాబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కి చేరింది. పాతమంత్రుల శాఖల్లో మార్పులు చేయకుండా.. ముఖ్యమంత్రి వద్ద ఉన్న శాఖలనే కొత్త మంత్రులకు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ బాధ్యతలు చేపట్టిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆయా వర్గాల సంక్షేమానికి సంబంధించిన దస్త్రాలపై సంతకాలు చేశారు. దివ్యాంగుల స్వయం ఉపాధి యూనిట్లకు రూ.5 కోట్లు మంజూరు చేశారు. దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలకు రూ.3.55కోట్ల రివాల్వింగ్ ఫండ్ విడుదలకు ఆమోదం తెలిపారు. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి ఎస్సీ లబ్ధిదారుల సంఖ్యను 210 నుంచి 500కి పెంచారు. గిరిజన విద్యా సంస్థల మరమ్మతులకు రూ.79.61కోట్లు, గిరిజన మినీ గురుకులాల నిర్వహణకు రూ.17.18 కోట్లు, మేడారం జాతర మిగిలిన పనులకు రూ.44.5కోట్లు మంజూరు చేశారు. జేఈఈ, నీట్‌లో ప్రతిభ కనబరిచిన 100 మంది గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించారు.

## బూర్గంపాడులో గిరిజన మహిళలపై దాడి అమానుషం: కేటీఆర్

హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలో గిరిజన మహిళపై దాడి అమానుషమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈ ఘటన సీఎం ఆలోచనలకు అద్దం పడుతోందని విమర్శించారు. సీఎంగా అలాంటి వ్యక్తి ఉంటే రాజ్యాంగం ఎక్కడ అమలవుతుందని ప్రశ్నించారు. "దేశానికి రాహుల్ గాంధీ ఇచ్చే హామీ ఇదేనా? దేశ మహిళలకు ప్రియాంకగాంధీ ఇదే గౌరవం కోరకుంటున్నారా? మల్లిఖార్జున ఖర్గే మాట్లాడుతున్న సమానత్వం ఇదేనా?" అని కేటీఆర్ ప్రశ్నించారు.






సింధూ నదీ జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఈ ఒప్పందం నిబంధనలను పాకిస్థాన్ ఉల్లంఘించిందని ఆయన మండిపడ్డారు. ఇన్నాళ్లూ దాయాది అన్యాయంగా నీళ్లు అందుకుందని, ఇకపై నీటి కొరతతో అల్లాడిపోవాల్సిందేనని దుయ్యబట్టారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్ షా ఈ ఒప్పందం నిలిపివేత గురించి ప్రస్తావించారు. "అంతర్జాతీయ ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయలేం. కానీ, సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసే హక్కు భారత్‌కు ఉంది. అదే చేశాం.

ఈ ఒప్పందం పీఠికలో రెండు దేశాలు శాంతి, పురోగతి సాధించాలనే విషయాన్ని పొందుపరిచారు. కానీ, ఒకసారి దీన్ని ఉల్లంఘిస్తే రక్షించడానికి ఇంకేమీ ఉండదు" అని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. "భారత్‌కు హక్కుగా లభించిన నీటిని సమర్థంగా వినియోగిస్తాం. కెనాల్‌ను నిర్మించి పాకిస్థాన్‌కు వెళ్లే నీటిని రాజస్థాన్‌కు మళ్లిస్తాం. ఇన్నాళ్లూ పాక్ అన్యాయంగా నీటిని అందుకుంది. ఇకపై ఆ దేశం గొంతు ఎండాల్సిందే" అని అమిత్ షా దుయ్యబట్టారు.

**భారత్‌లో ఏ ఉగ్రదాడి జరిగినా పాక్ మూల్యం చెల్లించుకోక తప్పదు: రాజ్‌నాథ్...** 1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయితే, పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో దీని అమలును భారత్ నిలిపివేసింది. ఇది దాయాదికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఈ ఒప్పందం నిలిపివేత పాకిస్థాన్‌ను ఎండబెట్టే అవకాశాలున్నాయి. ఆ దేశంలో నీటి సరఫరా అత్యధికంగా సింధూ జలాలపైనే ఆధారపడింది. అక్కడ వ్యవసాయానికి వాడే నీటిలో 80శాతం ఈ ఒప్పందం కింద లభించేదే. పాకిస్థాన్ జీడీపీలో 25శాతం ఈ నదుల నుంచే లభిస్తోందంటే.. భారత నిర్ణయం ఆ దేశాన్ని భవిష్యత్తులో ఎలా ప్రభావితం చేయనుందో అర్థం చేసుకోవచ్చు..!

**మహిళా రిజర్వేషన్లతోనే 2029 ఎన్నికలు..** ఈసందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు తదితర అంశాలపై అమిత్ షా స్పందించారు. "నియోజకవర్గాల పునర్విభజనపై ఫిర్యాదు చేసేందుకు ఎవరి వద్దా ఎలాంటి కారణాలు లేవు. అన్ని అంశాలను సమతుల్యంగా పరిగణనలోకి తీసుకునే దాన్ని చేపట్టబోతున్నాం. ఎవరూ అసంతృప్తికి గురికారు. 2026లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందునే డీఎంకే.. ఈ అంశాన్ని వ్యతిరేకిస్తోంది" అని హోంమంత్రి అన్నారు. ఇక, 2029లో జరిగే లోక్‌సభ ఎన్నికలు మహిళా రిజర్వేషన్లతోనే నిర్వహిస్తామని తెలిపారు. లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.




అన్నదాతలను ఆర్థికంగా ఆదుకునేందుకు తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. రైతు భరోసాలో భాగంగా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నిధులు జమ చేస్తోంది.

గత కొద్దిరోజుల నుంచి ఎకరాల వారీగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. నిన్న 7 ఎకరాల వరకు పొలం ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. ఇందుకోసం ప్రభుత్వం 905.89 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. శనివారం 9 ఎకరాల వరకు పొలం ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. ప్రభుత్వం ఇప్పటి వరకు 66.19 లక్షల మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసింది.

గురువారం నాడు 4,43,167 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసింది. భూమి పరంగా .. 106 లక్షల ఎకరాలకు పంట సహాయం అందించినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

## ఆరు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.7,770.83 కోట్లు జమ: మంత్రి తుమ్మల

హైదరాబాద్: రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధుల జమ కొనసాగుతోంది. ఇవాళ 9 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు విడుదలయ్యాయి. ఆరు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.7,770.83 కోట్లు జమ చేసినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భారాస హయాంలో రైతుబంధు నిధుల విడుదల నెలలపాటు సాగేదని విమర్శించారు. "మేం వేగంగా రైతు భరోసా ఇస్తుంటే భారాస నేతలు డ్రామాలు చేస్తున్నారు. ఓఆర్ఆర్ లోపల సాగు భూములను గుర్తించి వాటికీ రైతు భరోసా ఇస్తాం. పంట సాగయ్యే ప్రతి భూమికి రైతు భరోసా చెల్లిస్తాం. కోతల ప్రభుత్వమనే భారాస పార్టీని ప్రజలు తిరస్కరించారు. భారాస ప్రభుత్వం రుణమాఫీని ఎన్నేళ్లలో చేసిందో గుర్తు చేసుకోవాలి" అని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.



## రాష్ట్రంలో నడుస్తున్నది రైతు రాజ్యం కాదు.. బేడీల రాజ్యం: హరీశ్‌రావు

జిన్నారం: కేసీఆర్ పాలనలో అందరికీ రైతుబంధు వచ్చిందని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ హయాంలో ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న చాలా ఎకరాలకు రైతుభరోసా రాలేదని తెలిపారు. కేసీఆర్ పెట్టిన పథకాలకు కోతలు పెట్టడం తప్ప సీఎం రేవంత్‌రెడ్డి ఏమి చేయలేదని ఎద్దేవా చేశారు. సంగారెడ్డి జిల్లాలోని జిన్నారంలో భారాస ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో హరీశ్‌రావు, భారాస ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రైతు భరోసా రాని రైతులకు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రెండు రైతుభరోసా నిధులు సీఎం ఇవ్వలేదని చెప్పారు. కరోనా వచ్చినా భారాస హయాంలో రైతుబంధు ఇచ్చారని పేర్కొన్నారు. రైతులకు బేడీలు వేసి జైలులో పెట్టిన చరిత్ర రేవంత్‌రెడ్డిదని విమర్శించారు. రాష్ట్రంలో నడుస్తున్నది రైతు రాజ్యం కాదు.. బేడీల రాజ్యమని ఎద్దేవా చేశారు. గతంలో రేవంత్‌రెడ్డి తనపై కేసు పెట్టారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రియల్ ఎస్టేట్ పడిపోయిందని వ్యాఖ్యానించారు.



# తెలంగాణకు పాకిన రప్పా.. రప్పా డైలాగ్

సంగారెడ్డి, జూన్ 21: ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ ఇటీవల పల్నాడు జిల్లా పర్యటన సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలు ప్రదర్శించిన వివాదాస్పద ప్లకార్డులు రాజకీయంగా ఎంతటి దుమారాన్ని రేపాయో అందరికీ తెలిసిందే. మళ్లీ అధికారంలోకి వస్తే రప్పా.. రప్పా నరుకుతాం అంటూ వైసీపీ ప్లకార్డులు ప్రదర్శించడంపై కూటమి నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దీనిపై ఏపీలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధమే నడుస్తోంది. వివాదాస్పద ప్లకార్డులు ప్రదర్శించిన వారిని అరెస్ట్ కూడా చేశారు. ఇప్పుడు రప్పా.. రప్పా డైలాగ్ తెలంగాణకు పాకింది. అయితే ఏపీలో ఇలాంటి పాలిటిక్స్ కొత్తేమీ కాదు. కానీ తెలంగాణలో మాత్రం ఇలాంటి రాజకీయాలను ఎవరూ ప్రోత్సహించరు కూడా. ముఖ్యంగా బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు ఇలాంటి రాజకీయాలకు దూరంగా ఉంటారు.

కానీ ఇప్పుడు ఆయన పాల్గొన్న ధర్నాలోనే హరీష్ ఫోటోలతో రప్పా.. రప్పా అంటూ వెలిసిన ప్లకార్డులు సంచలనం రేపుతున్నాయి. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ రైతులకు రైతు భరోసా ఇవ్వాలంటూ జిన్నారంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు ధర్నాకు దిగారు. ఈ ధర్నాలో మాజీ మంత్రి హరీష్ రావు పాటు ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, మానిక్ రావు, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలు ప్లకార్డులు ఏర్పాటు చేశారు. 2028లో రప్పా.. రప్పా 3.0 లోడింగ్ అంటూ ప్లకార్డుల ప్రదర్శన చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ వ్యాప్తంగా ఈ ప్లకార్డులు వైరల్‌గా మారాయి. ఇలాంటి ప్రచారం ఎప్పుడూ జరగలేదని.. కొత్తగా ఉందంటూ పార్టీ నేతలు అనుకుంటున్న పరిస్థితి. అయితే హరీష్ రావు దృష్టిలో పడేందుకే సదరు నేత ఈ తరహా ప్రచారం చేసినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కచ్చితంగా గెలవబోతుందనే దానికి సంకేతంగా ఇలా ప్రచారం చేశాను తప్ప వేరే ఉద్దేశం లేదని ప్లకార్డులు ప్రదర్శించిన నేత చెప్పుకొచ్చారు. అయితే ఇప్పటి వరకు తన ఫోటోలతో వెలసిన రప్పా.. రప్పా ప్లకార్డులపై ఇటు హరీష్ రావు కానీ.. అటు బీఆర్ఎస్ అధిష్టానం కానీ స్పందించలేదు.



# శంషాబాద్ ఎయిర్ పోర్టు మహా విస్తరణ

హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయాన్ని భారీగా విస్తరించే ప్లాన్ ఒకటి బయటకు వచ్చింది. ఇప్పటికే దేశంలోని అత్యుత్తమ ఎయిర్ పోర్టుల్లో ఒకటిగా మారిన ఈ విమానాశ్రయం తన సత్తా చాటుతోంది. భవిష్యత్ అవసరాల కోసం రానున్న మూడేళ్లలో రూ.14వేల కోట్ల ఖర్చు ఉంటుందని అంచనా వేస్తున్నారు. మహా విస్తరణలో భాగంగా ఇప్పటికే ఉన్న టెర్మినల్.. రన్ వేకు అదనంగా కొత్త టెర్మినల్ .. రన్ వేను విస్తరించాలన్న ఉద్దేశంతో ఉన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మొదలయ్యే ఈ పనులు 2029 సెప్టెంబరు నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు. నిజానికి శంషాబాద్ అంతర్జాతీయ ఎయిర్ పోర్టును ప్రతి ఏడాది 3.4 కోట్ల మంది ప్రయాణికులు.. గంటకు 42 విమానాలు రాకపోకలు (టేకాఫ్, ల్యాండింగ్) సాగించేందుకు




వీలుగా జీఎంఆర్ గ్రూపు నిర్మించింది. 2017-18 నాటికి ఏటా 1.83 కోట్ల ప్రయాణికుల సంఖ్య అంతకంతకూ పెరుగుతూ వచ్చింది. ఏటా 7.1 శాతం వృద్ధి రేటుతో గత ఏడాది ఇది కాస్తా 2.95 కోట్లకు చేరింది. నిజానికి కరోనా కానీ లేకుంటే.. ఇప్పటి రద్దీ రెండేళ్ల కంటే ముందే ఉండేది. ప్రస్తుతం గంటకు రాకపోకలు సాగించే విమానాల సంఖ్య 36కు చేరింది. అంటే.. గరిష్ట పరిమితికి శంషాబాద్ ఎయిర్ పోర్టు దగ్గరకు వచ్చేసింది. ఇప్పుడున్న రద్దీ రానున్న రోజుల్లో మరింత పెరగటమే కానీ తగ్గే పరిస్థితి లేదు. దీంతో.. విమానాశ్రయాన్ని విస్తరించక తప్పని పరిస్థితి. ప్రస్తుత టెర్మినల్ ప్రయాణికుల వార్షిక సామర్థ్యాన్ని 3.4 కోట్ల నుంచి4.7 కోట్లకు పెంచటంతో పాటు.. గంటకు 46 - 47విమానాలు రాకపోకలు సాగించేలా ఇంకో టెర్మినల్ ను .. 3800 మీటర్ల పొడవైన రన్ వే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది. కొత్తగా విస్తరించే విమానాశ్రయం ఆధునీకరణను అధునాత సదుపాయాలతో పూర్తి చేయాలని జీఎంఆర్ గ్రూపు భావిస్తోంది.ఇందులో భాగంగా రన్ వే సరిగా కనిపించకున్నా పైలెట్లు విమానాల్ని సురక్షితంగా ల్యాండింగ్ చేసే ఆధునాతన టెక్నాలజీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

# అమెరికా గ్రీన్ సిగ్నల్ పై ఇజ్రాయెల్ సంచలన వ్యాఖ్యలు... వాట్ నెక్స్ట్?




ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య యుద్ధం తీవ్ర స్థాయిలో నడుస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్ అణుస్థావరాలపై దాడికి అమెరికా సిద్ధమవుతున్నట్లు వస్తున్న వార్తలు ఈ ఉద్రిక్తతలను మరింత పెంచుతున్నాయి. ఈక్రమంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా... న్యూక్లియర్ స్థావరాలపై దాడులు చేసేందుకు అమెరికా ఆదేశాల కోసం వేచి చూడలేమని అన్నారు. అవును... ఇరాన్ లో అణుకేంద్రాలన్నింటినీ ధ్వంసం చేసే సామర్థ్యం తమ దేశానికి ఉందని నెతన్యాహు పేర్కొన్నారు. ఇజ్రాయెల్ %-% ఇరాన్ దాడిలో అమెరికా ఎంట్రీపై పెరుగుతున్న చర్చల ప్రాధాన్యత వేల.. ఫోర్డ్ లోని భూగర్భ అణుకేంద్రంతో సహా ఇరాన్ న్యూక్లియర్ స్థావరాలపై దాడి చేయనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో.. ఇజాయెల్ ప్రధాని వ్యాఖ్యల్లో సాలో కాంఫిడెన్స్ కనిపిస్తుందని అంటున్నారు. అయితే, ఇందుకు అమెరికా నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చేవరకు వేచి ఉండబోమని నెతన్యాహు స్పష్టంచేయడం గమనార్హం. ఇప్పటివరకు నిర్వహించిన దాడుల విషయంలో కూడా యూఎస్ ఆదేశాల కోసం వేచి చూడలేదని చెప్పిన నెతన్యాహు... ఈ సందర్భంగా ఇరాన్ లో పరిపాలనను పతనం చేసే ఉద్దేశం తమకు లేదని, అది పూర్తిగా ఆ దేశ ప్రజలకు సంబంధించిన విషయమని అన్నారు. అదేవిధంగా... ఇరాన్ పై దాడిలో ట్రంప్ చేరాలనుకుంటున్నారా లేదా అనేది పూర్తిగా ఆయన నిర్ణయమేనని చెప్పిన నెతన్యాహు చెప్పుడం గమనార్హం. ఇదే సమయంలో... తాను ఇజ్రాయెల్ కు ఏది మంచిదో అదే చేస్తానని, అలాగే ట్రంప్ కూడా అమెరికాకు మంచి జరిగే నిర్ణయాలే తీసుకుంటారని చెప్పిన నెతన్యాహు.. ఇరాన్ అణుస్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తోందని అన్నారు.. ఇరాన్ పై సైనిక చర్య చేపట్టే విషయంలో ట్రంప్ రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటారని శ్వేతసౌదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో... ఇరాన్ తో త్వరలో చర్చలు జరిగే అవకాశాలు ఉన్నాయా, లేవా అనే అంశాన్ని బట్టి ట్రంప్ నిర్ణయం ఉంటుందని శ్వేతసౌదం తెలిపింది. ఏది ఏమైనా.. ఇజ్రాజెల్, ఇరాన్ వార్ లో ఇప్పుడు పెద్దన్న అమెరికా పాత్రపై కీలక చర్చ మొదలైంది.

# బ్రిటన్ ఎయిర్ బేస్ లోకి చొరబడి.. సైనిక విమానాలపై దాడి.. ఎందుకు?

అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. ఇజ్రాయెల్ వ్యతిరేకవాదులు బ్రిటన్ లో షాకింగ్ చర్యకు చేపట్టారు. కలలో కూడా ఊహించలేని పరిస్థితికి కారణమయ్యారు. సెంట్రల్ ఇంగ్లండ్ లోని రాయల్ ఎయిర్ ఫోర్సు స్థావరంలోకి అక్రమంగా చొరబడటమే కాదు.. రెండు సైనిక విమానాలపై దాడికి పాల్పడిన ఉదంతం సంచలనంగా మారింది. అంతేకాదు.. ఇంజిన్ లోకి ఎరుపు రంగు పెయింట్ చల్లారు. ఈ రెండు విమానాల్ని ఇంధనం నింపటానికి.. ఇతర రవాణా సౌకర్యాల కోసం బ్రిటన్ మిలిటరీ ఈ లోహ విహంగాల్ని వినియోగిస్తోంది.

ఈ వ్యవహారంపై తాజాగా పాలస్తీనా యాక్షన్ గ్రూప్ స్పందిస్తూ.. తమకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఆక్స్ ఫర్డ్ షైర్ లో




బ్రిజ్ నార్టన్ ఎయిర్ బేస్ లోకి చొరబడ్డారని అంగీకరించింది. పాలస్తీనాకు చెందిన వారు బ్రిటన్ విమానాల్ని ధ్వంసం చేయటమా? ఎందుకిలా? అన్న ప్రశ్నకు సింపుల్ సమాధానం.. గాజాలో ఇజ్రాయెల్ దాడులపై బ్రిటన్ ప్రభుత్వం బహిరంగంగా ఖండిస్తున్నా.. పరోక్షంగా ఆ దేశానికి మద్దతు ఇవ్వటమే కారణంగా పేర్కొంటున్నారు. ఇజ్రాయెల్ యుద్ధ విమానాలకు బ్రిటన్ ఇంధనం నింపటం లాంటి చర్యల్ని చేపడుతోంది.

ఈ నేపథ్యంలో బ్రిటన్ దేశ సైనిక విమానాల్ని తమ వర్గం వారు ధ్వంసం చేసినట్లుగా పాలస్తీనా యాక్షన్ గ్రూపు సోషల్ మీడియాలో పోస్టు చేయటం గమనార్హం. కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న బ్రిటన్ కు తగిన గుణపాఠం చెప్పటం.. గాజా మారణహోమంలో చురుకైన పాత్ర పోషించటం లాంటి చర్యలకు పాల్పడటాన్ని తప్పు పట్టింది. ఇదంతా ఒక ఎత్తు అయితే.. అత్యంత కఠినమైన భద్రతా ఏర్పాట్లు ఉండే సైనిక స్థావరాల్లోకి ఇద్దరు నిందితులు ఎలా వెళ్లారు? సైనిక విమానాలపై దాడి ఎలా సాధ్యమన్న దానిపై విచారణ అధికారులు విచారణ చేస్తున్నారు.

# తీవ్ర ఉద్రిక్తతల వేళ భారత్ కు గుడ్ న్యూస్ చెప్పిన ఇరాన్!

ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య యుద్ధం తీవ్రస్థాయిలో జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ భీకర యుద్ధంతో పశ్చిమాసియా రగిలిపోతోంది. దీంతో.. ఆ ప్రాంతంలోని విమానాశ్రయాలన్నీ మూసివేశారు. ఫలితంగా... గగనతలంలో పౌరవిమానాలు కనుమరుగయ్యాయి. ఈ సమయంలో భారత్ కు ఇరాన్ ఓ గుడ్ న్యూస్ చెప్పింది. అందుకు భారత్.. థాంక్స్ చెప్పింది. అవును... ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలోని పలు విమానాశ్రయాలు మూసివేయబడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్ గగనతలాన్ని పూర్తిగా మూసివేసింది. దీంతో వేల మంది విదేశీయులు ఇరాన్ లో చిక్కుకుపోయారని అంటున్నారు. ఇదే సమయంలో వేల మంది భారతీయులు ఇరాన్ లో ఇరుక్కుపోయారు! ఈ నేపథ్యంలో ఇరాన్ గుడ్ న్యూస్ చెప్పింది. ఇందులో భాగంగా... భారతీయుల తరలింపు విమానాల కోసం ప్రత్యేకంగా గగనతలాన్ని తెరవాలని నిర్ణయించింది. దీంతో... ఇరాన్ నగరాల్లో చిక్కుకున్న భారతీయ విద్యార్థులను ఈ రోజు విమానంలో తరలించనున్నట్లు తెలుస్తోంది. 'ఆపరేషన్ సింధు' అని నామకరణం చేసిన ఈ కార్యక్రమం ద్వారా 1000 మంది విద్యార్థులను తీసుకురానున్నారని అంటున్నారు.

ఈ క్రమంలో... మొదటి విమానం ఈ రోజు రాత్రి భారత కాలమానం ప్రకారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఢిల్లీకి చేరనుందని.. మిగిలిన రెండు విమానాలు శనివారం ల్యాండ్ కానున్నాయని అంటున్నారు. ఈ సందర్భంగా స్పందించిన విదేశాంగ శాఖ ప్రతినిధి... విదేశాల్లో ఉన్న భారతీయ పౌరుల భద్రతకు భారతదేశం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని అన్నారు.

భారతీయ పౌరులు తమ భూభాగాల గుండా సురక్షితంగా ప్రయాణించడానికి వీలు కల్పించినందుకు ఇరాన్, అర్మేనియా ప్రభుత్వాలకు భారత ప్రభుత్వం కృతజ్ఞతలు తెలుపుతుందని తెలిపారు. మరోవైపు... పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో తమ విద్యార్థులను కూడా ఆ ప్రాంతం నుంచి తరలించాలని నేపాల్, శ్రీలంక దేశాలు భారత్ ను కోరాయి. దీంతో ఆయా దేశాల పౌరులను 'ఆపరేషన్ సింధు'లో భాగంగా విమానాల్లో తరలించాలని నిర్ణయించింది. టెహ్రాన్ లో భారత రాయబార కార్యాలయం ఈ విషయాన్ని ఓ ప్రకటనలో పేర్కొంది.

## సినిమా 'షో'

# కింగ్ నాగార్జున ఇదే ఫార్ములాను కంటిన్యూ చేస్తాడా?

టాలీవుడ్‌లో ఉన్న టాప్ సీరియర్ హీరోల్లో కింగ్ నాగార్జున ఒకరన్నది తెలిసిందే. అయితే చిరుతో పాటు బాలయ్య, విక్టరీ వెంకటేష్ హీరోలుగా సోలో హిట్‌లు సాధిస్తూ ఎంజాయ్ చేస్తుంటే కింగ్ నాగార్జున మాత్రం గత కొంత కాలంగా సరైన సక్సెస్‌ని దక్కించుకోలేక సతమతమవుతున్నారు. కెరీర్ పరంగా చాలా ఇబ్బందికరమైన ఫేజ్‌ని ఎదుర్కొంటున్నారు. గత ఏడాది మలయాళ రీమేక్ ఆధారంగా నాగ్ చేసిన మూవీ 'నా సామి రంగ'. 2024 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా నాగ్‌కు ఆశించిన విజయాన్ని అందించలేకపోయింది. కానీ ఈ ఏడాది సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో వచ్చిన వెంకీ మామ మాత్రం బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకుని వసూళ్ల పరంగానూ రికార్డులు సృష్టించాడు. నాగ్ మాత్రం ఆ రేంజ్ హిట్‌ని సొంతం చేసుకోలేక బాక్సాఫీస్ వద్ద విఫలమయ్యాడు. ఈ నేపథ్యంలోనే కింగ్ నాగార్జున కొత్త ఫార్ములాని ఫాలో కావాలని, హీరోగా, నటుడిగా కొనసాగాలంటే, అందరిలో ఉన్న క్రేజ్‌ని అలాగే మెయింటైన్ చేయాలంటే కొత్త పంథాని అనుసరించక



తప్పదనే నిర్ణయానికి వచ్చారట. ఇందులో భాగంగానే కథకు కీలకంగా నిలిచే పవర్ ఫుల్ నెగెటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్లకు ఓకే చెప్పాలనుకున్నారట. దాని ప్రకారమే హీరో రోల్స్ అప్పుడప్పుడు చేస్తూ పవర్ ఫుల్ క్యారెక్టర్లకు ప్రాధాన్యత నివ్వాలని డిసైడ్ అయ్యారట. తన కొత్త ఫార్ములా ప్రకారమే ధనుష్ నటించిన 'కుబేర', సూపర్ స్టార్ రజనీకాంత్ తో లోకేష్ కనగరాజ్ తెరకెక్కిస్తున్న 'కూలీ' సినిమాల్లో విలన్ షేడ్స్ ఉన్న పాత్రల్లో నటించారని తెలుస్తోంది. రజనీ 'కూలీ'లో నాగ్ పవర్ ఫుల్ విలన్‌గా సిమోన్ అనే క్యారెక్టర్‌లో కనిపించబోతున్నాడు. ఈ క్యారెక్టర్ చాలా పవర్ ఫుల్‌గా ఉంటుందని, రజనీతో ఢీ అంటే ఢీ అనే స్థాయిలో ఉంటుందని అంటున్నారు. ఆ కారణంగానే నాగ్ ఈ క్యారెక్టర్ చేశాడట. ఇప్పటికే బాలీవుడ్ మూవీ 'బ్రహ్మాస్త్ర'లో పవర్ ఫుల్‌గా సాగే నంది అస్త్ర క్యారెక్టర్‌లో నటించిన నాగ్ ఇకపై ఇదే ఫార్ములాని కొనసాగిస్తూ తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రూపొందే సినిమాల్లో పవర్ ఫుల్ క్యారెక్టర్లు చేస్తారట. అయితే ఇక డైరెక్టర్లు చాలా వరకు నాగ్ కోసం కొత్త తరహా క్యారెక్టర్లని సృష్టించడం ఖాయం.

# అనగనగనగ కథ: చంద్రబోస్ నుంచి పవర్‌ఫుల్ సాహిత్యం




నాటు నాటు ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందడం వెనక, భారతదేశానికి ఆస్కార్ ని అందించడం వెనక ఎం.ఎం.కీరవాణితో కలిసి పని చేసిన బృందంలో కీలక వ్యక్తి, ఆ పాటను రాసిన సీనియర్ లిరిసిస్ట్ చంద్రబోస్. ఆయన సాహిత్యంలో పదజాలం సార్వజనీనతతో మ్యాజిక్ చేస్తుంది గనుకే ఈ రోజు అంతటి గుర్తింపు. నాటు నాటు కోసం బోస్ ఎంపిక చేసుకున్న తెలుగు పదాలను తెల్లోళ్లు కూడా అవలీలగా పాడుకున్నారు. అది ఆయన ఘనత. దశాబ్దాలుగా పాటల రచనలో ఆయన అనుభవం సమున్నతమైనది. ఇప్పుడు అదే అనభవంతో ఆయన రాసిన ఓ పాట ప్రజల హృదయాలను గెలుచుకుంటోంది.

అది కుబేర కోసం అనగనగ కథ.. అందరికీ తెలిసిన కథ...సాంగ్. డబ్బు కేంద్రంగా సాగే ఈ పొలిటికల్ డ్రామా థీమ్ ని ఈ పాట ఎలివేట్ చేస్తోంది. చంద్రబోస్ చాలా పవర్‌ఫుల్ పదజాలాన్ని ఉపయోగించి పాటను అద్భుతంగా రాసారు. ఎదిగేవాడిని తొక్కేవాడి కథ, పేదలు బలహీనుల కథ, అంతం లేని అరాచకుల కథ ఎలా ఉంటుందో ఆయన వర్ణించిన తీరు ఉత్కంఠను పెంచుతోంది. రాక్ స్టార్ దేవీశ్రీ ప్రసాద్ సంగీతం, బోస్ సాహిత్యం కార్తీ, కరీముల్లా ఎనర్జిటిక్ గానం కూడా పెద్ద ప్లస్. కమ్ముల నిజ జీవితం సంఘటనల ఆధారంగా కొన్ని సన్నివేశాల్ని ఇందులో చూపిస్తున్నారన్న గుసగుస ఉంది. ఈ సీజన్ లో మోస్ట్ అవైటెడ్ చిత్రంగా రానున్న కుబేరకు సాహిత్యం, సంగీతం ప్రధాన అస్సెట్ కానున్నాయి.

ఈ పాన్-ఇండియన్ చిత్రంలో ధనుష్ ప్రధాన పాత్రను పోషిస్తుందగా, నాగార్జున అక్కినేని, రష్మిక ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. శేఖర్ కమ్ముల దర్శకుడు. ఈ చిత్రం సెన్సార్ ఫార్మాలిటీలను పూర్తి చేసుకుంది. 181 నిమిషాలు - అంటే మూడు గంటల ఒక నిమిషం నిడివితో యుఏ సర్టిఫికేట్ పొందింది. ప్రమోషనల్ మెటీరియల్ ఇప్పటికే ప్రేక్షకులలో ఆసక్తిని రేకెత్తించింది. బుకింగ్‌లు బావున్నాయన్న టాక్ ఉంది. సునీల్ నారంగ్ - పుస్కుర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మించారు.

# జిమ్ నుంచి వెళుతూ పూజా చిక్కిందిలా

టాలీవుడ్ లో అవకాశాలు ముఖం చాటేసినా, కోలీవుడ్ లో వరుస అవకాశాలు అందుకుంటోంది పూజా హెగ్డే. అటు బాలీవుడ్ లోను ఈ భామకు అవకాశాలకు కొదవేమీ లేదు. ప్రస్తుతం జన నాయగన్ అనే చిత్రంలో దళపతి విజయ్ సరసన నటిస్తోంది. కోలీవుడ్ బాలీవుడ్ ని బ్యాలెన్స్ చేస్తూ ఈ అమ్మడు నిరంతర విమాన ప్రయాణాలు చేస్తోంది. పూజా ఓ వైపు చెన్నై టు ముంబై ప్రయాణాలతో బిజీగా ఉన్నా, జిమ్ యోగా సెషన్స్ ని మాత్రం విడిచిపెట్టడం లేదు. ఫిట్నెస్



ఫ్రీక్ నిరంతరం జిమ్ కి వెళుతోంది. తాజాగా ముంబై శాంటాక్రజ్ లో జిమ్ ముగించి ఇంటికి వెళుతూ పూజా ఫోటోగ్రాఫర్ల కంట పడింది. పూజా బ్లాక్ కలర్ బాడీ ఫిట్ స్పోర్ట్స్ దుస్తుల్లో కనిపించింది. అయితే తన భుజంపై పింక్ కలర్ పట్టీ దేనికో చెప్పనే లేదు. చేతికి వైట్ హ్యాండ్ బ్యాగ్, కాళ్లకు వైట్ స్పోర్ట్స్ షూస్ ధరించి కనిపించింది. అలా జిమ్ నుంచి బయటకు వచ్చి కార్ వైపు వెళుతున్న పూజాను ఫోటోగ్రాఫర్లు కొన్ని క్లిక్స్ కి సహకరించాల్సిందిగా కోరుతున్నారు. కానీ పూజా వారితో మాట్లాడుతూనే కార్ ఎక్కి వెళ్లిపోయింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. పూజా సింపుల్ గా మేకప్ లెస్ లుక్ లో కనిపించింది. జిమ్‌లో కఠినంగా శ్రమించిందని తన రూపం చెబుతోంది. పూజాలోని ఈ డెడికేషన్ తన టోన్డ్ ఫిట్ బాడీని హైలైట్ చేస్తోంది. ఇటీవలే సమంత ముంబై బాంద్రాలో జిమ్ నుంచి వెళుతూ కెమెరాల కంటికి చిక్కింది. ఇదే సెలబ్రిటీ ఏరియాలో మలైకా, ప్రగ్య జైశ్వాల్, రకుల్ ప్రీత్ లాంటి భామలు జిమ్ లో కుస్తీలు పడుతూ ఫోలోలకు ఫోజులివ్వడం చూస్తున్నదే. ఇక కెరీర్ మ్యాటర్ కి వస్తే... పూజా నటించిన జననాయగన్ వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల కానుంది.

Name of Premises : Venus Enclave, Block - 0, Quthbullapur City, Medchal Malkajgiri District - 500055, email : sanjeevreddyetlapuram@gmail.com. Cell : 8985829417